తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) చిన్నకథల పోటీలో రెండవ బహుమతి
రు. 400/- లు గెలుచుకున్న రచన.



# తనది కాని నీతి

— రేణుక

"నిజాయితీ దేశంలో ఎక్కడా కనిపించడం లేదు" అన్నాడు పేపరులోంచి ముఖంపైకి ఎత్తి వీరాస్వామి.

"ఏమిటి విశేషం?" అన్నాను ఎదురుగా కూర్చున్న నేను.

"చూశారా? పశుగ్రాస ఉత్పాదక యంత్రాలపై దిగుమతి సుంకం మూడున్నర కోట్లు నాయకులు స్వాహా చేసారట"

"అక్రమ సంపాదన జపానులో లేదా? అమెరికాలో లేదా? మొన్ననే కదా జపాను ప్రధాన మంత్రి ఎంత తిన్నాడో బయట పడింది. ఇది గ్లోబల్ ఫినామినన్! అంతర్జాతీయంగా జరుగుతున్నదే! కర్నల్ నార్తుకు శిక్ష పడలేదా?"

"అదే నేను చెప్పేది. ముందు రాజకీయ నాయకులలో నిజాయితీ కావాలి. మంత్రులు చేతులు చాస్తే బంట్రోతు చాచడా?"

"అది నిజమే!" అన్నాను నేను.

"కాని నేడు ఏం జరుగుతోంది? మన డబ్బు మన దేశం డబ్బు స్విస్ బేంకులలో వేస్తున్నారు. ఆ వేసిన వాళ్ళు ఎవరో ఎంత వేసారో ఇంచుమించుగ ఈ పేపర్లు చెపుతూనే వున్నాయి. పోనీ అది అలా వుంచండి. ఆ బోఫోర్స్ డీల్ వెస్ట్ జర్మనీ జలాంతర్గాముల సంగతేమిటి? స్వార్థంతో దేశాన్ని మన నాయకులు అమ్మేస్తున్నారా?"

"మనది ప్రజాస్వామ్యం అన్నది మరచి పోతున్నారు" అన్నాను నేను కొంచెం బాధగానే. "నాయకులనని ప్రయోజనం ఏమిటి? ప్రజలు ఎన్నుకున్న నాయకులేగా వాళ్ళు. నిజాయితీలేని ప్రజలకు నిజాయితీ వున్న నాయ కులు ఎక్కడ నుండి వస్తారు? ఓటును అమ్ముకునే ప్రజలకు దేశాన్ని నంజుకునే నాయకులు. అందుకే ముందు ప్రజలలో నిజాయితీ రావాలి"

"ప్రజలు నిజాయితీగా వున్నారు" అన్నాడు వీరా స్వామి. "ఇంకా మనలాంటి నిజాయితీ పరులు వుండబట్టే దేశం ఈ మాత్రంగానైనా వుంది!"

అంతలోనే రైలు విజయవాడ స్టేషనులో ఆగింది. పేపరు మడత పెట్టి అక్కడ పడేసి లేచాడు వీరాస్వామి.

ప్లాట్ ఫారమ్ జనంతో కిటకిటలాడి పోతోంది. ఆ జనాన్ని చూస్తే జనాభా సమస్య దేశంలో ఎంత తీవ్రంగా వుందో తెలుస్తుంది. ఈ సమస్యను మన నాయకులు పరిష్కరిస్తే గాని దేశానికి భవిష్యత్తు లేదన్న ఆలోచన రాగానే ఏదో

భయం వేసింది నాకు.

వీరాస్వామి రైలు దిగి సీసా నిండా నీరు పట్టి తెచ్చాడు. అది భార్యకు అందించి ఫలహారశాల దగ్గరికి వెళ్ళాడు.

ఆ స్టాల్ దగ్గర పెద్ద రద్దీ. తొడ తొక్కిసలాగావుంది. ఆ జనంలో దూరాడు వీరాస్వామి. కొద్ది సేపటిలో దోసిట్లో ఇడ్లీ, వడ ఆకుతో కంపార్టుమెంటు దగ్గరకు వచ్చాడు. బయట నుండే ఆ ఆకును భార్య చేతిలో పెట్టాడు.

హడావుడిగా తిరిగి పరుగెత్తాడు. పుస్తకాల స్టాలు దగ్గరకు వెళ్ళాడు. అక్కడ ఏవేవో తెలుగు పత్రికలు కొని తెచ్చాడు. అతడు కొన్నవి చూస్తే దేశంలో పత్రికలు చదివేవాళ్ళ సంఖ్య ఎంత పెరిగిందో తెలుస్తుంది. చదువే జ్ఞానం. జ్ఞానం మార్గమే మానవ ప్రగతికి మార్గం అని పించగానే నాకు వేదసూక్తి 'శాశ్వత పంథా అయనాయ విద్యతే' గుర్తుకు వచ్చింది.

ఆ పుస్తకాలు అన్నీ తొందరగా వీరాస్వామి కిటికీలోంచి 'భార్య దగ్గరికి పడేసాడు. ఇంకా హడావుడిగా మళ్ళీ పరుగెత్తాడు. ఎందుకు ఇలా పరుగెత్తాడా అని చూస్తు న్నాను నేను. వీరాస్వామి ఫలహార శాల దగ్గరకు వెళ్ళాడు.

"నాకు చిల్లరే ఇచ్చావు" అన్నాడు వీరాస్వామి ఆ శాల వాడితో "అయిదు రూపాయిలు ఇవ్వలేదు"

"నేను ఇచ్చేసాను" అన్నాను అతడు.

"దబాయించకు. తీసుకుని నేను మళ్ళీ వచ్చానంటావా? బోడి అయిదు రూపాయిల కోసం! నిజాయితీ వుండాలి. నా అయిదు నాకు ఇచ్చెయ్యి" వీరాస్వామి అరచాడు.

గొడవ ప్రారంభమయింది. దానితో అందరూ అక్కడ పోగయ్యారు. నేను వెళ్ళాను.

"ఇవ్వకపోతే అప్పుడే అడిగి తీసుకోవాలి. ఇప్పుడు వచ్చి నాకు అయిదు రావాలంటే ఎలా?" అంటూ స్టాల్ యజమాని అక్కడ పోగుపడ్డ జనం కేసి చూచాడు. "చూడండి! ఇంకొకడు వచ్చి నాకు ఏభై రావాలంటే? ఇలా దబాయించిన వాళ్ళకి ఇస్తుంటే నా స్టాల్ మూసేసుకోవాలి"

"అయితే నేను అబద్ధ మాడానంటావా? నాకు నిజాయితీ లేదనుకుంటున్నావా" అంటూ వీరాస్వామి తన నిజాయితీని రుజువు చేసాడు. జేబులోంచి అయిదు వంద నోట్లు, మూడు పది నోట్లు నిమురుగా తీసి ముందు కొచ్చాడు.

"నా జేబులో అయిదు వంద నోట్లు అయిదు పది నోట్లు వున్నాయి. ఇక్కడి టిఫెను తీసుకుని పది ఇచ్చాను. పుస్తకాలు పది రూపాయలని కొన్నాను. అక్కడే చూశాను. అయిదు రూపాయిలు తక్కువ వున్నట్టు చూసుకో!"

నాకూ అక్కడ వాళ్ళకూ వీరాస్వామి చెప్పింది నిజం అనిపించింది. అయిదు రూపాయిల కోసం అబద్ధం ఆడేవాడిలా లేదు. అయిదు రూపాయిలు నిజంగా పోయిన వాడిలానే విలవిలలాడుతున్నాడు. అక్కడ చేరిన వాళ్ళలో ఒక పెద్ద స్టాల్ వాడిని అయిదు రూపాయిలు వీరాస్వామికి ఇచ్చేయమని తీర్పు ఇచ్చాడు.

ఆ స్టాల్ వాడు లబోదిబో అన్నాడు. "అది అన్యాయం. నేను ఇవ్వను" అంటూ మొండిగా కూర్చున్నాడు.


"డొక్క చీరేస్తా! ఎవరనుకుంటు న్నావో, ముందు అయిదు ఇవ్వు" అంటూ వీరాస్వామి ముందుకు దూకాడు. నేను అడ్డుపడకపోతే అతడు ఆ స్టాల్‌వాడి కాలరు పట్టుకునేవాడే. తరువాత ఏం జరుగునో!

వాగ్యుద్ధం తారస్థాయి చేరేసరికి రైలు బయలుదేరే గంట కొట్టాడు. గార్డు పచ్చ జండా ఊపాడు. నేను నా కంపార్టుమెంటుకు వచ్చేసాను. తరు వాత వీరాస్వామి పి.టి.ఉషలా పరుగెట్టి హాప్ స్టెప్ అండ్ జంప్‌లు చేసి రైలులో పడ్డాడు.

"దొంగ వెధవ" అన్నాడు తన సీటు లో కూర్చుంటూ వీరాస్వామి. అతడు కోపంతో ఊగిపోతున్నాడు. "రైలు కదిలింది కనుక బతికి పోయాడు."

'ఎక్కడ చూసినా అవినీతే!' అని పించింది నాకు. ఏలూరు స్టేషన్‌లో కాఫీలు ఇచ్చిన కుర్రాడు నాకు అయిదు రూపాయిలు ఇదిగో ఇస్తానంటూ మాయమయింది గుర్తుకు వచ్చింది. ఇక రైల్వే స్టేషన్లలో, బస్సుల్లో తిరిగి రావలసిన చిల్లర సంగతి అందరికీ తెలిసిందే. 'ఆఫీసుకు వెళ్ళినందుకు జీతం తీసుకుంటారు. పని చేయడానికి బాహాటంగా లంచం తీసుకుంటారు. ఇవీ రోజులు!' అనుకున్నాను నేను.

** ** **



కలం పేరు: రేణుక
పేరు: డి.శకుంతల

పుట్టింది రాజమండ్రి. పెరిగింది, జీవితం చూసింది ఎన్నెన్నో చోట్ల. ప్రస్తుతం శ్రీవారి ఉద్యోగం మూలంగా వున్నది విజయవాడలో. ఇద్దరు కొడుకుల్లో ఒకడు ఐ.ఎ.ఎస్., రెండవ వాడు కంప్యూటరు ఇంజనీరింగ్‌లో కళాప్రపూర్ణగా కేంద్ర ప్రభుత్వంలో క్లాసు వన్ ఆఫీసరు. గృహిణిగా ఎంతో గర్వపడుతుంటాను. ఇమిటేషన్ కథలు కోకొల్లలుగా వస్తున్న రోజుల్లో ఏదో వ్రాయాలన్న తపనే నా ఈ కథకు నాంది. నా కథకు రెండవ బహుమతి లభించడం నా గొప్ప అనుకోను. బహుమతి అందించిన 'ఆంధ్రజ్యోతి' సంపాదకవర్గానిదే ఈ ఘనత అని చెపుతూ వారికి అభినందనలు చెప్పుకుంటున్నాను.

— రేణుక

వీరాస్వామి పుస్తకాలు తిరగేస్తు న్నాడు. వాటిమీద అతడి దృష్టి లేదు. అయిదు రూపాయిలు పోగొట్టుకున్నా నన్నది అతడిని బాగా కలవరపెట్టినట్టు ంది. అతడి వాలకం చూసి అతడి భార్య కూడా మాట్లాడకుండా కూర్చుంది. నేనూ ఏదో పుస్తకం తిర గేస్తున్నాను.

"టిఫిన్ తిందామా?" భార్యను అడిగాడు వీరాస్వామి.

"మీరు ఎప్పుడు అడుగుతారా అని ఎదురుచూస్తున్నాను" అంటూ ఆమె ఆ టిఫిన్ వున్న ఆకును తన చేతిలోకి తీసుకుంది.

అప్పుడు వాళ్ళిద్దరి కళ్ళూ ఒక్క సారి ఆ ఆకు తీసిన చోటుపై కేంద్రీక రించాయి. అక్కడ వుంది అయిదు రూపాయిల కాగితం!

ఒక్క క్షణం ఆగకుండా వీరాస్వామి దానిని తీసి జేబులో పెట్టుకున్నాడు. అది నేను చూడలేదనుకున్నాడు. టిఫిన్ తినడం ప్రారంభించాడు.

అయిదు రూపాయిలు పోయిందను కుని వీరాస్వామి చేసిన గందరగోళం నాకు గుర్తుకు వచ్చింది. అందరూ ఆ స్టాలువాడిని తిట్టారు.

అప్పుడు అసలు ఏం జరిగిందో నేను ఊహించుకోగలిగాను. తొందరలో టిఫిన్ ఆకు క్రింద వున్న అయిదు రూపాయిల కాగితం అతడు భార్య చేతిలో పెట్టాడు. అయిదు రూపాయిలు జేబులో కనిపించకపోయే సరికి స్టాలువాడిపైకి పోట్లాటకు వెళ్ళాడు. సరే! ఇది అతని పొరపాటే అనుకుందాం! మరిప్పుడు అది కనిపిం చింది. సడిచప్పుడూ లేకుండా జేబులో పెట్టు కున్నాడు. ఇదేనా నిజాయితీ? కాని ఈ వీరాస్వామికి నాయకులు నిజా యితీగా వుండాలా?

అతిచిన్న విషయం. ఇందులో తన కళ్ళు కప్పడానికి వీరాస్వామి ప్రయత్నిం చాడు. మన కళ్ళు మన నాయకులు కప్పుతున్నారని గోల చేస్తున్నాడు. ఎవడి తప్పు వాడు తెలుసుకోవాలి. అప్పుడే మనిషి అవుతాడు. ఈ వీరాస్వామి తాను చేసిన తప్పు ఒప్పుకుంటాడా అన్న ప్రశ్న నాకు ఎదురైంది.

ఈ వీరాస్వాములేనా మన దేశ ప్రజలు! వీళ్ళకు వీళ్ళ తప్పులు తెలి యవా? బురదలో పొరలాడుతూ పన్నీరు వాసన కావాలంటే ఎలా? ఈ ప్రశ్నలకు సమాధానం నాకు తోచ లేదు. అంతలోనే వీరాస్వామి టిఫిన్ తిన్న ఆకును బయటపడేసాడు.

అప్పుడు వీరాస్వామి మాటలు నా చెవులలో పడ్డాయి.

"దొంగ వెధవ! నిజాయితీ లేని వెధవ! అయిదు రూపాయిలు నోటు కాజేస్తాడా?"